# ఆడబ్రతుకే మధురం!

రచయిత : శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు

తాతయ్య అమ్మమ్మని ఇప్పటికీ కొడతాడు. నాన్న అమ్మని కొడతాడు. అక్కయ్యని బావ కొడతాడు. మొగ వాళ్లు ఆడవాళ్లని కొడతారు. తిడతారు కూడానూ.

"ఆడబ్రతుకే మధురం" అని రేడియో పాడుతున్నది.

ఎంతో పాపం చేసుకుంటేనేగాని ఆడవాళ్లయి పుట్ట రుట అమ్మమ్మ చెప్పింది. అందుకనే మొగవాళ్లాడవాళ్లని కొడతారు, తిడతారు.

మహా పతివ్రతలుకూడా వచ్చే జన్మలో ఆ మొగుడే కావాలని కోరుకుంటూరు. ఆడజన్మ వొద్దని ఎందుకు కోరరో? ఈ జన్మలో ఆడవాళ్లంతా పుణ్యంచేస్తే వచ్చే జన్మకి ప్రపంచంలో ఆడవాళ్లే ఉండరు. అంతా మొగవాళ్లే ఉంటూరు. అప్పుడు మనమంతాకూడా క్రాపులు పెట్టుకుని, మూళ్లేసుకుని, సిగిరెట్టు కాలుస్తూ తిరగొచ్చు.

కిందటి జన్మలో చేసుకున్న పాపం విరగడైపోవటానికి ఆడవాళ్లు మొగవాళ్లచేత తన్నులూ, తిట్లూతినాలి. చాకిరి చెయ్యాలి. నాన్నకూడా ఆఫీసుకెళ్లి చాకిరిచేస్తాడు. అయితే నాన్న కాదివారం శెలవు. అదీకాక ఎప్పుడన్నా వొంటో బాగుండకపోతే నాన్న ఆఫీసెగ్గొట్టి ఇంటో ముసుగుపెట్టుకు పడుకుంటాడు. అమ్మకి ఆదివారాలు లేవు, పని ఎగ్గొట్ట టానికి వీల్లేదు. ఎందుకంటే, మరి అమ్మకి జీతంలేదుగా!

కిష్టమూర్తిగారి పెళ్లాం మంచి ఆడదికాదు. ఆవిణ్ణి మొగుడు కొట్టడు, తిట్టడు. పైగా ముద్దుచేసి పాడుచేస్తు న్నాడు. ఆవిడ మొహానికి పౌడరేసుకుంటుంది. మాటి మాటికీ సినిమాలకీ నాటకాలకీ పోతుంది. మీటింగుల క్కూడా పోతుంది. వంట చెయ్యటానికి కట్టెలుపయోగించదు. ఆవిడకి కట్టెలంటే మంట. ఆవిడ మళ్లీ వచ్చే జన్మలోకూడా ఆవిడకి కిష్టమూర్తిగారే మొగుడవుతాడుగాముట. అయితే ఆవిడ కెప్పుడూ ఆడజన్మే, ఆవిడ ఖర్మం!

ఆడవాళ్లు చదువుకోరాదు. చదువుకున్నా పెళ్లయి పోగానే మానాలి. కిష్టమూర్తిగారి పెళ్లాం పిల్లల తల్లిఅయి కూడా మొన్న మొన్నటిదాకా చదువుకుంటూనే ఉంది. ఆవిడ ఇప్పుడు బియ్యే పాసయింది. ఆడవాళ్లంతా చదువు చదువుకుంటే చెడిపోతారు. అయితే కిష్టమూర్తిగారి పెళ్లాం చెడిపోయినట్టు కనిపించదు. ఎప్పుడూ అందర్నీ నవ్విస్తూ మాట్లాడుతుంది. కాని నిజంగా చెడిపొయ్యే ఉంటుంది. చిన్నపిల్లల కవన్నీ తెలియవు. అటువంటి విషయములో ప్రశ్నలు వెయ్యరాదు.

కొందరాడవాళ్లు చదువుకోకుండానే చెడిపోతారు. మూలఇంటో హనుమాయమ్మ చెడిపోయిన బాపతేకాని చదువుకోలేదు. చదువుకోకుండా చెడిపోతే అది వాళ్ల ఖర్మం.

కిష్టమూర్తిగారి పెళ్లాం పిల్లల్ని కొట్టదు. "నిన్ను నీ మొగుడు కొడితే ఏం చేస్తావే"? అంటే వాళ్లవాణి "చంపేస్తా!" అంటుంది. వాణికూడా వాళ్లమ్మల్లేనే ఎప్పటికీ ఆడదే అవుతుంది. దాన్ని వాళ్లమ్మ పాడుచేస్తున్నది. వాణి అప్పుడే ఇంగ్లీషు చదువుతుంది. సినిమాపాటలుకూడా పాడుతుంది. అయితే ఏం లాభం? పుణ్యమా పురుషార్థమా? పిన్నికూతురు సుశీల చక్కగా సంస్కృతంలో కుమార సంభవమూ అవీ చదువుకుంది. పాడు ఇంగిలీషుకాకుండా అది చక్కగా మువ్వ గోపాల పదాలుకూడా పాడుతుంది. పాడు సినిమాపాటలంటే దానికి అసహ్యాం.

> ఆడబ్రతుకులో వున్న మాధుర్యమంతా వున్నదున్నట్లు హాస్యంలో గుప్పేశారు ఒక అమాయక బాలిక నోటిగుండా. ఆడబ్రతుకులోని మాధుర్యం తత్పరిణామం నిజంగా సంతోషించ తగినవే. —సం॥



http://www.maganti.org/

## పరంపర

"ఆడబ్రతుకే మధురం" అని పాడుతున్నది రేడియో.

ఆడవాళ్లతో అన్నీ చిక్కులే. అమ్మ ఎడంగా ఉన్నప్పుడు నాన్న చేసే అల్లరి అంతా ఇంతా కాదు. తెగ గొణుక్కుంటాడు. ఆడవాళ్లకు అన్నీ బాధలే. పిల్లల్ని కన్నప్పుడు చచ్చినంతపని అవుతుంది. బోలెడు డబ్బు ఖర్చు. ఆడవాళ్లతో అంతా ఖర్చే. ఒక చీర ఖరీదు పెడితే నాలుగు ధోవతులొస్తయ్. పిల్లల్ని కని కొంతమంది ఆడవాళ్లు చచ్చిపోతారు. ముత్తైదు చావు చావటం ఎంతో పుణ్యం. వాళ్లు మొగాళ్లై పుడతారేమో. వెంకట సుబ్బమ్మ అవ్వగారు వచ్చే జన్మలో మొగవాడై పుడుతుంది. ఆవిడ కొడుకు స్వాములవారై పోయినాడు. పెద్దన్నయ్య స్వాములవారై పోతే అమ్మకూడా వచ్చే జన్మలో మొగవాడై పుడుతుంది.

ఆడపిల్లలుకూడా ఖర్చే. పెళ్లిళ్లు చెయ్యాలంటే బోలెడు కట్నాలు పొయ్యాలి. అందర్నీ పిలిచి భోజనాలు పెట్టాలి. అప్పుడు వాళ్లంతా వచ్చి మర్యాద సరిగా జరగలేదాని తిట్టిపోతారు. ఆడపిల్లలకి చిన్నపిల్లలప్పుడు పెళ్లి చెయ్యటం పుణ్యం. అమ్మకు ఎనిమిదేళ్లకు పెళ్లిచేసి తాతయ్య కన్యాదానఫలం పొందాడు. ఇప్పుడంతా పెద్దపిల్లలకు పెళ్లిచేస్తున్నారు. ఇట్లా చేస్తే పాపం. కలికాలంగనక ఇటువంటివన్నీ వస్తున్నై.

నేను పెద్దదాన్నయితే కొట్టే మొగుణ్ణిమాత్రం చేసుకోను. పుణ్యం లేకపోతే పీడాపాయె, ఎవరు పడతారమ్మా దెబ్బలూ, తిట్లూనూ? పెద్దదాన్నయితే ఎవరికీ తెలీకుండా కిష్టమూర్తిగార్ని చేసుకుంటాను!...

"ఆడబ్రతుకే మధురం!" అనే పాట పాడటం మానేసింది రేడియో.


# SCABIOL

**SOVEREIGN REMEDY FOR ALL SKIN DISEASES**

గజ్జి, వేడికురుపులు, మొటిమలు, తామర మొదలగు చర్మవ్యాధులకు

## స్కేబియాల్

సాటిలేని మందు.

Agents for Andhra Desa: C. P. Tham & co., Cocanada; for Travancore & Cochin States: Chandy & co., Trichur; for Palghat: N. L. Parasurama Iyer, (Mamakutty), Palghat.

*Manufacturers:*

**THE MADURA COTTAGE INDUSTRIES,**

MANUFACTURERS & REPRESENTATIVES

**17, PERUMAL TANK STREET, MADURA.**





http://www.maganti.org/

Source: Press Academy Website, Andhra Mahila Magazine, Oct 1946

**Disclaimer:** This topic/article/write-up of Sri Kodavatiganti Kutumba Rao has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan